క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక



రామడుగు(చొప్పదండి): మండలంలోని వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి నవ్వుల్ల భువనచంద్ర తయారు చేసిన యంత్రం రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజమౌళి తెలిపారు. దీని ద్వారా క్రిమిసంహారక మందుల వాడకుండా పంటల్లోని చీడ పురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థికి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఫర్హత్ షాహీన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. భువనచంద్రను సర్పంచ్ తీగల సంగీత, వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ప్రతిభ




కొత్తపల్లి(కరీంనగర్): ఎస్‌వోఎఫ్ నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లిష్ ఒలింపియాడ్ టెస్ట్‌లో కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బి.శ్రేయాన్స్, ఎండీ.అయానుద్దీన్, ఎండీ.ఫరహానుద్దీన్, టి.విఘ్నేశ్వరసాయి, హైమద్ తదితరులు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించినట్లు పేర్కొన్నారు. వారిని గురువారం అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు.. అందక చిక్కులు

- 75 ఏళ్ల గణతంత్రం దరిచేరని వైనం
- హక్కుల కోసం ఉద్యమాలు
- అణచివేతలపై పోరాటాలు
- నేడు గణతంత్ర దినోత్సవం

సిరిసిల్ల: స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు అవుతోంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న తరుణంలోనూ రాజ్యాంగహక్కులు ఇంకా సామన్యులకు దరి చేరడం లేదు. పేదలు ఇంకా పేదలుగానే మిగిలిపోయారు. ధనవంతులు మరింత సంపన్నులుగా ఎదిగిపోయారు. నేటికీ ఇల్లు లేని నిరుపేదలు.. విద్య, వైద్యం అందని దుస్థితిలో దేశం ఉంది. పేదరిక నిర్మూలనకు ఎన్నో పథకాలను పాలకులు అమలుచేస్తున్నా.. అవి అట్టడుగు వర్గాలకు అందడం లేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం.. అందని తీరు... రాజ్యాంగ హక్కుల కోసం సాగుతున్న పోరాటాలపై విభిన్న వర్గాల అభిప్రాయాలు వారి మాటల్లోనే..



రాజ్యాంగ ఫలాలు అందే వరకు పోరు



దేశపౌరులకు ప్రాథమిక హక్కులు, ఆదేశికసూత్రాల గురించి పూర్తిగా తెలియదు. రాజ్యాంగబద్ధంగా అందాల్సినవి సరైన విద్య, వైద్యం, ఉపాధి, న్యాయం, ప్రజల కనీస అవసరాలు తీర్చడం లేదు. ఇందుకు పాలకవర్గాలే కారణం. రాజ్యాంగ ఫలాలు సామాన్యులకు అందేంత వరకు పోరాడక తప్పదు.

– మల్లారపు అరుణ్‌కుమార్, ఎంపీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు, వీర్నపల్లి

హక్కులు ఉన్నట్లు చాలా మందికి తెలియదు



రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రజలందరికీ సమానంగా అందాలంటే ముందుగా వారిని జాగృతం చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ చాలా మందికి రాజ్యాంగం హక్కుల గురించి తెలియదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అవగాహన కల్పించాలి.

– మద్దికుంట లక్ష్మణ్, కవి, ఉపాధ్యాయుడు

సామాజిక న్యాయం పాటించాలి



రాజ్యాంగ వ్యవస్థలు రాజకీయ పార్టీలు సమన్యాయం పాటించాలి. పేద, బడుగు, బలహీనవర్గాలకు హక్కుల సాధనకు శాసనకర్తలు, అధికారులు సమన్యాయం పాటించాలి. అప్పుడే రాజ్యాంగ ఫలాలు అందరికి అందుతాయి. ముందుగా రాజ్యాంగ హక్కులపై ప్రచారం చేయాలి.

– వర్లపల్లి వేణుగోపాల్, ఎంపీపీ, బోయినపల్లి

సామాన్యులకు అందడం లేదు



రాజ్యాంగ హక్కులు ఇంకా సామాన్యులకు అందడం లేదు. హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయాల్సి వస్తోంది. పేదలను ఎవరూ పట్టించుకోవడం లేదు. పాలకులు చట్టాలను కాలరాసేలా పాలిస్తున్నారు. సంక్షేమ పథకాలన్నీ కార్పొరేట్ శక్తులకు చేరుతున్నాయి. పేదలు పేదలుగానే మిగిలిపోతున్నారు.

– ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రాథమిక హక్కులకే దిక్కులేదు



ప్రాథమిక హక్కులకు దిక్కులేదు. నిరక్ష్యరాస్యతతో చాలా మందికి అవి తెలియవు. ఉచిత వైద్యం, విద్య అందడం లేదు. విద్యార్థి సంఘాలు, యువత ఉద్యమించే తీరు ఆవేదన కలిగిస్తోంది. స్వేచ్ఛగా భావ ప్రకటన చేసే అవకాశం లేదు. రాజ్యాంగ హక్కులు దక్కితే అసమానతలు పోతాయి.

– విఘ్నేశ్, సిరిసిల్ల

పెట్టుబడిదారుల చేతుల్లోనే రాజ్యం



దేశంలోని మొత్తం సంపద పది శాతం వ్యక్తుల చేతుల్లో ఉంది. పెట్టుబడిదారుల చేతుల్లో రాజ్యం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగహక్కులు, ప్రాథమిక సూత్రాలు సామన్యులకు ఎలా అందుతాయి. శ్రమించే వారికి హక్కుల కోసం పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదు. కార్మిక హక్కులు, కనీస వేతన హక్కులు అమలు కావడం లేదు.

– కోడం రమణ, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పోరాటాలతోనే న్యాయం



పెత్తందారులు, దోపిడీదారులు, పెట్టుబడిదారులు ఉన్నంత కాలం రాజ్యాంగహక్కులు సామాన్యులకు దక్కవు. రాజ్యాంగాన్ని సరిగా అమలు చేస్తే.. ఏ పోరాటం అవసరం లేదు. అవి అమలు కాకపోవడంతోనే పోరాటాలు సాగుతున్నాయి. పేదలకు సంక్షేమం అందితే.. ఆకలి పోతుంది. రాజ్యాంగ లక్ష్యం నెరవేరుతుంది.

– బొజ్జ కనకయ్య, జనసమితి జిల్లా అధ్యక్షుడు

బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి కేదారి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల పేద ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించిందని, కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఉరితాడు బిగించే నల్ల చట్టాలను కొనసాగించే ప్రయత్నం చేస్తోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు దేశంలోని అన్ని జాతీయ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం నుంచి గీతా భవన్ చౌరస్తా వరకు ర్యాలీ చేపడుతామన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండేటి వాసుదేవ్, నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన నేరస్తుడు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని వల్భాపూర్‌కు చెందిన తాటికంటి సంపత్(30)కు జైలుశిక్ష పడింది. కానీ, అతను తప్పించుకు తిరుగుతూ చివరికి పోలీసులకు చిక్కాడు. ఎస్సై వంశీకృష్ణ వివరాల ప్రకారం.. సంపత్ వల్భాపూర్‌కే చెందిన ఓ యువతిని 2007లో అత్యాచారం చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి, అతన్ని 2008లో హుజూరాబాద్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పదేళ్ల జైలుశిక్ష విధించారు. అయితే, సంపత్ హైకోర్టును ఆశ్రయించడంతో 2023లో మూడేళ్లు తగ్గించి, ఏడేళ్ల శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అప్పటినుంచి అతను తప్పించుకు తిరుగుతున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ సారయ్య ఆధ్వర్యంలో పోలీసులు వెతుకుతుండగా గురువారం దొరికాడు. అతన్ని హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచి, జడ్జి ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ సారయ్యను ఆయన అభినందించారు.

ధర్మనిధి పురస్కారానికి ‘దాస్యం’ ఎంపిక



కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సాహిత్య పరిషత్ ధర్మనిధి సాహిత్య పురస్కారానికి జిల్లాకు చెందిన కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి ఎంపికైనట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం పరిషత్‌లోని దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో అవార్డు, రూ.5 వేలు అందించి, జ్ఞాపికతో సత్కరిస్తారని అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవులు నంది శ్రీనివాస్, కొత్త అనిల్ కుమార్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, స్తంభంకాడి గంగాధర్, కేఎస్.అనంతాచార్య, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్, గాజుల రవీందర్, అన్నాడి గజేందర్‌రెడ్డి, వైరాగ్యం ప్రభాకర్, సంకెపల్లి నాగేంద్రశర్మ, దొమ్మాటి శంకరప్రసాద్, గంగుల శ్రీకర్, నటులు ఆర్.సదానందం, కొత్తకొండ సత్యనారాయణ తదితరులు సేనాధిపతిని అభినందించారు.

ఎన్నీల ముచ్చట్లు



కరీంనగర్ కల్చరల్: కవిత్వ సృజనకు నవ్యతే ప్రాణమని రచయిత, సమీక్షకుడు అన్నాడి గజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి తెరవే ఆధ్వర్యంలో 129వ ఎన్నీల ముచ్చట్లను భగత్‌నగర్‌లోని ఆయన ఇంటి డాబాపై నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీవీ.కుమార్, దామరకుంట శంకరయ్య సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పలు అంశాలపై రచయితలు, కవులు వినిపించిన కవితలు ఆలోచింపజేశాయి. ఇటీవల గిడుగు పురస్కారం పొందిన రచయిత ఎండీ.ఖాలిద్‌ను అభినందించారు. కార్యక్రమంలో అన్నవరం దేవేందర్, పీఎస్.రవీంద్ర, కందుకూరి అంజయ్య, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, దేవి యాదగిరి, నడిమెట్ల రామయ్య, పెంచాల రంగన్న, విజయశ్రీ, చిమ్మని చంద్రశేఖర్, విలాసాగరం రవీందర్, బుర్ర తిరుపతి, వాసాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.